# సీటు కోసం

... పి. వి. రామ్‌మోహన్‌రావు ...

అప్పుడే తెల్లవారుతోంది. అరుణ కాంతులు ఎర్రగా వున్నాయి. ఎక్స్‌ప్రెస్ మహానది బ్రిడ్జిని మందగమనంతో దాటేస్తుంది. సూర్యకిరణాలు కిటికీలగుండా దూసుకొని ప్రయాణీకులను మేల్కొలుపుతున్నాయి. ఆ మహానదిని తిలకిస్తూ కాంతం ఆనందిస్తుంది. ప్రక్కనున్న ముసలమ్మ 'ఏటమ్మా కిటికీగుండా ముఖం అంత దించిచూస్తున్నావు. అంత వొంగి తొంగిచూస్తె కింద పడగలవు. ఇంతకీ ఏటి చూస్తున్నావు?' అంది. వంతెన దాటిపోయింది. కాంతం తిరిగి తనసీటులో కూర్చుంది కాని ఆ ముసలిదానికి తన గొడవ దేనికని చిరాకుపడింది. బయటకు ఏమి అనలేకపోయింది. ఇంతలో ముసలమ్మ మళ్ళీ సంభాషణ మొదలుపెట్టింది. 'అత్తోరింటి కెల్తున్నావేటి తల్లీ? ఏ వూరేటి?'

'ఔను బరంపురం' అని ఆమెవేపు చూడకనే ముక్తసరిగా జవాబు చెప్పింది. ఎక్స్‌ప్రెస్ కటకంస్టేషను వచ్చి ఆగింది. ఆ స్టేషనులో ఒక ఆడమనిషి చిన్నపిల్లాడితో బండిలోనికి వచ్చింది. ఇంతలో కాంతం కాస్త గరంచా పుచ్చుకుందామని తలుపువద్దకువచ్చి, చా సేవించి తిరిగి తనసీటువద్దకు వెళ్ళబోయే సరికి తనకి పట్టరాని కోపం వచ్చింది. టీ త్రాగివచ్చేసరికల్లా తనసీటులో కూర్చోవాలా. కొంచెమైన బుద్ధివుండొద్దూ, అని మనసులో అనుకుంది. 'ఇది నా సీటమ్మా, మీరు లేవండి. నేను టీ త్రాగడానికి వెళ్ళి వచ్చేను' అని అంది కాంతం. అంతలో ముసలిది అందుకుని 'అవునమ్మా నేను సెప్పుతుంటే యీమె జగడానికి కాలు దువ్వి కూకుంది' ఇంతలో పిల్లడి తల్లికి కోపం వచ్చింది. 'ఈసీటు నువ్వు గుత్తకొన్నావేంటి. ఇందుమీద నీ పేరు వ్రాసివుందా నేను యిక్కడనుండి లేవను' అని అంది. బాగుంది టీ పుచ్చుకోడానికి వెళ్లివచ్చేలోగా నాసీటు ఆక్రమించి ఆ పైన దబాయించడం కూడానా? లేస్తావా లేవ్వా!

'నేను లేవను. కావలిస్తే నీ బాబుతో రిపోర్టు చేసుకోపో' అంది.

'మంచిమాటలతో చెప్పుతున్నాను. మర్యాదగా లే. లేకపోతే నిష్కారణంగా......

'మాటలు తిన్నగా రానియ్యవమ్మా అనవసరంగా ప్రేలకు.'

'నా మాటలు తిన్నగానే వున్నాయిలే. నీకు సిగ్గులేదూ' అని కాంతం బలం కొద్ది కోపంతో ఆవిడను చెయ్యిపట్టిలాగింది. చేతిలోని పిల్లడు ఏడ్వడం మొదలెట్టేడు.

'నీకు కళ్ళులేవు చేతిలోని పిల్లాణ్ణి చూసేవా' అని అంది పిల్లడితల్లి. అంతలో ముసలిది తగువుతీర్చడానికి మధ్యకు వచ్చి 'అదేటమ్మా అలా కొట్లాడుకుంటారు. ఆ అమ్మ నేను ఎక్కక ముందు కాడనుండి బండిలో వుంది. కాకాదూరంనుండి వత్తుంది. నువ్విప్పుడనగా వచ్చి జాగాకోసం గోలెట్టేస్తున్నావు.'

ఎలాగయితేనేం బలవంతముగా ఆవిడ ప్రక్కనే యిరికి కూర్చుంది కాంతం. ప్రక్కస్టేషనులో ముసలిది దిగిపోయింది. దాని మూలంగా వీరిద్దరికీ జాగా దొరికింది. చాలాసేపటివరకు నిశ్శబ్దంగానే వుంది. కొంతసేపటికి నిశ్శబ్దం జయించలేకపోయింది. రెండేండ్ల పిల్లడు వచ్చి కాంతంవడిలో చేతులు ఆన్చి నిలబడ్డాడు, గబుక్కున కాంతం పిల్లడిచెయ్యి దూరంగా విసిరేసింది.

'నీవంటినున్న బంగారము అంటుకుపోతుందేమిటమ్మా చంటోడు తెలియక చెయ్యేస్తె.'

'నీ పిల్లాడు నీకుముద్దు. నా సిల్కుచీర పాడుచేసేడు' అని అంది. ఆవిడకూడా బరంపురం వెళ్తున్నట్లుగా తెలుసుకుంది కాంతం. వాళ్ల చిలిపి దెబ్బలాట్లను బండి వెక్కిరిస్తూ 'బయెవ్' మంది.

పదకొండు గంటలైంది. ఎండ తీవ్రంగా వుంది. బరంపురంస్టేషనులో బండి ఆగింది. కాంతం, సీతా వస్తున్నారని తెలిసి రామారావు ప్రతీపెట్టె చూస్తున్నాడు. ఇంతలో 'ఏమండీ వచ్చారా' అని కాంతం, 'ఏం అన్నయ్యా, బావయిచ్చిన టెలిగ్రాం అందిందా?' అని సీతా వక్కసారిగా అన్నారు. భార్య, చెల్లెలు వకేపెట్టెలోవుండడం చాలా సంతోషించేడు రామారావు. కాని కాంతం, సీత ఒకరి మొఖాలు ఒకరు చూస్తూ నిర్ఘాంతపోయినారు. అట్లా అట్టే సేపు చూచుకుంటే ఎవరేమనుకుంటారో అని యిద్దరూ కోపంగానే మూతులు ముడుచుకున్నారు. స్టేషను దగ్గరే ఒక మంచి జటకా బేరమాడి భార్య చెల్లెలిని యెక్కించేడు రామారావు. తను ప్రక్కనే సైకిలుమీద వస్తున్నాడు. ఈవిడ నా ఆడబడుచా? అయ్యో రైల్లో దెబ్బలాడేను. ఆయనగారితో చెప్పతే ఏమనుకుంటారో ఏమో' అనుకొంటోంది కాంతం కాంతం మాట్లాడినగాని మాట్లాడను అని పంతం పట్టుకొనికూచుంది సీత. బరంపురం రోడ్లు కదూ! జట్కాలోవాళ్లకు తలలు గట్టిగానే తగుల్తున్నాయి. బండివెనుక సైకిలు మీద వస్తున్న రామారావు వీళ్ళిద్దరినీ పరిచయంచేశాడు. చెల్లీ నువ్వు మరి నాపెళ్ళికి వచ్చేవు కాదు. ఎంతైన మీరు గొప్పవాళ్ళు. బీదవాళ్ళపెళ్ళికి వస్తారా' అదిగో ఆమే మీ వదిన' ఎప్పుడు నిన్ను చూడలేదు అని అంటూ వుంటాది. ఈమధ్యను బయలుదేరివద్దామనుకుంటున్నాము. ఇంతలో నువ్వేరానేవచ్చేవు'

'బాగుంది మంచి వదిన్నే సంపాదించేవు. కటకంలో ఎక్కేసరికి కొంచెం జాగా యివ్వడానికి మూడు చెరువులనీళ్ళు తాగించింది.'

కాంతం మెల్లిగా 'క్షమించండి ఎవరో అనుకున్నాను' అంటూ యిల్లు చేరుకున్నారు.

రోజులు గడిచిపోతున్నాయి. ఆడపడుచు వదినెల అభిమానం యెక్కువైంది. కాంతం 'ఒదినా ఆనాటిరైల్లో మీరెక్కతే ఎవ్వరో అనుకున్నాను. మీరని తెలుస్తె ఆ కొంచెం జాగా కూడా యివ్వకపోయుందును.'

'ఏమో ఎవరికి తెలుసు నిజంగా తెలిసేవుంటే నాలుగు తన్నేవుందువేమో.'

ఇంతలో చంటివాడు 'అత్తా' అంటూ సగం తింటున్న యెంగిలితో వచ్చి పట్టుకున్నాడు. కాంతం పిల్లాడిని యెత్తుకొని అన్నం తినిపిస్తుంది.

'పిల్లాడు నిన్ను పట్టుకుంటే చీర పాడయిపోతాది వదినా' అంది సీతమ్మ మెల్లిగా.

'పర్వాలేదులే. ఆనాటిరైల్లో మేనల్లుడు కాదులే' అంది.

ఇద్దరు నవ్వుకున్నారు. ఆనాడు సీత తిరుగు ప్రయాణం. సీత వెళ్ళిపోతుంది కదా అని ఆనాడు కాంతానికి చాల దిగులుగా వుంది. అన్నంకూడా సహించలేదు. 'తిరుగ యీ ప్రయాణంలో నీలాంటి ఆవిడ దొరుకుతే ప్రయాణం బాగానే చేస్తాను. చోటు కావలసినంత దొరుకుతుంది' కాంతానికి ఏ సమాధానం చెప్పడానికి తికమకపడ్డాది. 'వెళ్తాను వదినా, దయమాత్రం వుంచు' అంది సీత వస్తున్న యేడ్పునిదాచుకొని. బొట్టుపెడుతూ కండ్లలో గిర్రున తిరుగుతున్నాయి. 'మంచిది' అని కాంతం అనగలిగింది. జటకాబండి కదిలిపోయింది, ఇద్దరి చీరచెంగులు కళ్ళమీదకు పోయినాయి. రామారావు స్టేషన్‌కి వెళ్ళి చెల్లెలను బండిలో యెక్కించి వచ్చేసేడు. 'ఆ దొరికింది నీలాంటి యిల్లాలు జాగా చేసి ప్రక్కన కూర్చోపెట్టుకుంది' అన్నాడు రామారావు నవ్వుతూనే. 'ఆ చాల్లెద్దురూ' అంటూ కాంతం మూతి తిప్పింది.